సాక్షి
అన్నమయ్య జిల్లా

బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025



ప్రభుత్వ నిర్లక్ష్యం.. పండితులకు శాపం

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసి తొమ్మిది నెలలు అవుతున్నా.. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. -8లో



ధ్వజస్తంభం సంప్రోక్షణకు అంకురార్పణ

ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ధ్వజస్తంభం సంప్రోక్షణకు అర్చకులు మంగళవారం అంకురార్పణ నిర్వహించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.230	రూ.290
రెండోరకం	రూ.150	రూ.220

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 179 మెట్రిక్ టన్నులు



జగజ్జనని.. లోకపావని



మదనపల్లె సిటీ: కమ్మగడ్డవీధిలోని దుర్గామాత విగ్రహం

‘దుష్టశిక్షణ.. శిష్టరక్షణ’ కోసం అమ్మవారు అనేక అవతారాలు ధరించారు. వాటిలో కొన్నింటికి విశేష చరిత్ర ఉంది. జగన్మాత రూపాలను దేవీ శరన్న వరాత్రుల్లో ఒక్కో రోజు ఒక్కో అలంకారంలో పూజించడం సంప్రదాయంగా వస్తోంది. జిల్లా వ్యాప్తంగా దసరా ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. రెండో రోజైన మంగళవారం లోకమాత ఒక్కో ప్రాంతంలో ఒక్కో అలంకరణలో దర్శనమిచ్చారు. రంగురంగుల పూలు, విద్యుత్ దీపాల వెలుగుతో ఆలయాలు దేదీప్య మానంగా వెలుగొందుతున్నాయి. పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలతో కిటకిటలాడుతున్నాయి. శక్తి స్వరూపిణిని భక్తులు కనులారా దర్శించుకుని పులకించిపోయారు. ‘జగజ్జనని.. లోకపావని’ అంటూ శరణు వేడారు. ‘కొలిచే వారి కొంగు బంగారమై నిలిచే తల్లీ.. మమ్మల్ని చల్లంగా చూడు’ అంటూ భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాయచోటి టౌన్ : పార్వతీదేవిగా శ్రీభద్రకాళి



గుర్రంకొండ : గాయత్రీదేవిగా రెడ్డెమ్మతల్లి



ములకలచెరువు : గాయత్రీదేవిగా అమ్మవారు



రైల్వేకోడూరు అర్బన్ : జగన్మోహినిగా..



రాజంపేట టౌన్ : వాసవీకన్యకాపరమేశ్వరిదేవి ఊరేగింపు



మదనపల్లె సిటీ: గాయత్రీమాతగా వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి

న్యూస్‌రీల్

నవోదయ దరఖాస్తుల గడువు పొడిగింపు

రాజంపేట: ఉమ్మడి వైఎస్‌ఆర్ కడప జిల్లాకు సంబంధించిన రాజంపేట మండలం నారమరాజుపల్లెలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తుల గడువు పొడిగించామని ప్రిన్సిపాల్ గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026–2027 విద్యాసంవత్సరానికి అక్టోబరు 7 వరకు గడువు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2027 ఫిబ్రవరి 7న అర్హత పరీక్ష ఉంటుందని వివరించారు.

4న వాహనాల వేలం

రాయచోటి టౌన్: రవాణాశాఖ అధికారులు తనిఖీల్లో పట్టుకున్న వాహనాలను అక్టోబర్ 4న వేలం వేస్తున్నట్లు జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజంపేట ఆర్టీసీ డిపోలో ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్తుగా రూ.5 వేలు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు. పాల్గొనే వారు ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ చూపించి టోకెన్ పొందాలని సూచించారు. వాహనాల వివరాలు అన్నమయ్య జిల్లా రవాణాశాఖ కార్యాలయ నోటీస్ బోర్డులో ఉన్నట్లు వివరించారు.

నేడు దస్తగిరి షా ఖాద్రి బర్సీ



కమలాపురంలో వెలసిన దర్గా-ఏ-గఫారియా

కమలాపురం: కమలాపురం పెద్దదర్గాగా వెలుగొందుతున్న దర్గా-ఏ-గఫారియాలో బుధవారం రాత్రి దస్తగిరి షా ఖాద్రి బర్సీ నిర్వహిస్తున్నట్లు దర్గా కన్వీనర్, వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ షేక్ ఇస్మాయిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 7 గంటలకు స్వామి వారికి పూల చాదర్లు సమర్పించి, అనంతరం గంధం ఎక్కిస్తారని ఆయన అందులో పేర్కొన్నారు. రాత్రి అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. భక్తులు విరివిగా హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి



మాట్లాడుతున్న జేసీ ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి టౌన్: 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల కోసం స్థానిక స్థాయి నుంచి అందరం కలసికట్టుగా పని చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అన్నారు. మంగళవారం రాయచోటిలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాల్‌లో పంచాయతీ పురోగతిపై సూచిక 2.0పై జిల్లాలోని అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ (ఎంఓపీఆర్) రూపొందించిన పంచాయతీ పురోగతిపై సూచిక 2.0(పీఏఐ–2.0) శిక్షణ బేస్ లైన్ డేటాను అందిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రణాళికను జాతీయ స్థాయిలో ఉన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను (ఎస్‌డీజీలు) అనుసంధానం చేయడానికి వ్యూహాత్మక సాధనంగా పని చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలల గూడు.. చెదిరెను చూడు

మధ్యతరగతి ప్రజల సొంతింటి కల చెదురుతోంది. ఎంఐజీ లేఅవుట్‌లు వేసి పనులు ప్రారంభించిన వేళ.. వారు ఆనంద భరితులయ్యారు. తర్వాత వారి ఆశలు ఆవిరయ్యాయి. నిర్మాణాలు అర్థాంతరంగా నిలిచిపోవడంతో.. ఈ పరిస్థితి నెలకొంది.

- మధ్యతరగతి ప్రజల ప్లాట్లపై నీలినీడలు
- ఎంఐజీ లే అవుట్‌లకు గ్రహణం
- ఎక్కడికక్కడే ఆగిన పనులు
- వైఎస్సార్‌సీపీ హయాంలో శరవేగం
- కూటమి పాలనలో నిలిచిపోయిన వైనం



అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని ఎంఐజీ లేఅవుట్‌లో ఆగిన పనులు

సాక్షి రాయచోటి: గత వైఎస్సార్ కాంగ్రెస్ సర్కారు అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ.. మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరతో ఇంటిని అందించాలన్న సంకల్పంతో.. ఎంఐజీ లే అవుట్లు నెలకొల్పింది. ఎంతో మహోన్నత ఆశయంతో అప్పట్లో ప్రభుత్వం చేపట్టినా.. ప్రస్తుత కూటమి సర్కారు పట్టించుకోకపోవడంతో మధ్యతరగతి ప్రజల ఆశలపై నీలినీడలు అలుముకున్నాయి. జిల్లాలోని ప్రధాన పట్టణాల సమీపంలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా.. అనువైన స్థలాలు సేకరించి అందించేందుకు ఏర్పాట్లు చేశారు. అందుకు సంబంధించి లబ్ధిదారులకు కొన్ని చోట్ల లక్కీడిప్ ద్వారా స్థలాల కేటాయింపు చేశారు. అంత వరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వం మారిపోవడంతో రాయచోటి లాంటి పెద్ద లే అవుట్లలో నిర్మాణాలు ఆగిపోయాయి.

అన్ని నియోజకవర్గాల్లో.. లే అవుట్లు

అన్నమయ్య జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో మధ్యతరగతి ప్రజలకు సంబంధించి లే అవుట్లకు అవసరమైన స్థలాల ఎంపికను అధికారులు పూర్తి చేసి పనులు ప్రారంభించారు. రాయచోటి దిగువ అబ్బవరం పరిధిలో 31.07 ఎకరాలు తీసుకోగా, తర్వాత మరో 20 ఎకరాల వరకు అవసరం మేరకు కేటాయింపులు జరుపుతూ వచ్చారు. రాజంపేట పరిధిలోని తాళ్లపాక పంచాయతీలో 9.92 ఎకరాలు, రైల్వేకోడూరు పరిధిలో 20 ఎకరాలు, పీలేరు పరిధిలో దొడ్డిపల్లి-వేపులబైలు వద్ద 30 ఎకరాలు, తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోట మండలంలోని ముదివీడు గ్రామం వద్ద 19.36 ఎకరాలు, మదనపల్లె పరిధిలోని పోతపోలు గ్రామం వద్ద 21.56 ఎకరాల స్థలాలను కేటాయించారు. పట్టణాల్లో నివసించే మధ్యతరగతి ప్రజలకు సంబంధించి అనుకూల వాతావరణంలో ఉండే స్థలాలను ఎంపిక చేసి లే అవుట్లకు సిద్ధ చేశారు. ప్రధానంగా మూడు కేటగిరీల్లో 150, 200, 260 చదరపు అడుగులతో కూడిన ప్లాట్లు అప్పట్లో సిద్ధం చేశారు.

జిల్లాలోని ఆరు నియోజకవర్గాల ఎంఐజీ లే అవుట్ల స్థల వివరాలు

నియోజకవర్గం	కేటాయించిన భూమి (ఎకరాల్లో)	ప్లాట్లు
రాయచోటి	31.07	233
రాజంపేట	9.92	111
రైల్వేకోడూరు	20.00	234
పీలేరు	30.00	284
తంబళ్లపల్లె	19.36	205
మదనపల్లె	21.56	--



అసంపూర్తిగా మంచినీటి ట్యాంకు నిర్మాణం

రాయచోటి లే అవుట్‌లో..

రాయచోటిలో ఎంఐజీ లే అవుట్‌లో ప్లాట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. దిగువ అబ్బవరం సమీపంలోని 30 ఎకరాల్లో తొలి విడత లే అవుట్ వేసి 233 మందికి అందించారు. ఇంకా ప్లాట్లకు డిమాండ్ ఉండటంతో వేగవంతంగా మరో 20 ఎకరాలు ప్రస్తుతం ఉన్న లే అవుట్ పక్కనే సేకరించారు. పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. ఎక్కడికక్కడ మౌలిక వసతుల కల్పనతో అద్భుతంగా తీర్చిదిద్దారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ఆ పనులను చేపట్టకపోవడంతో ఆగిపోయాయి. నీళ్ల ట్యాంకు నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ప్రహరీల నిర్మాణంతోపాటు అవసరమైన ప్రభుత్వ కమ్యూనిటీ భవనాలు, ఇతర అనేక పనులు పెండింగ్‌లో పడిపోయాయి. రింగ్‌రోడ్డు నుంచి ఎంఐజీ లే అవుట్ వరకు అద్భుతంగా డబుల్‌రోడ్డు కనిపిస్తున్నా.. వాడకం లేకపోవడంతో ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోయాయి. ఎంఐజీ లే అవుట్ అంతా కళా విహీనంగా మారింది. అయితే కలెక్టర్ నిషాంత్‌కుమార్ ప్రత్యేకంగా దృష్టి సారిస్తే ప్రజల సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది.



పురోగతి లేని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ



ముందుకు సాగని విద్యుత్ పనులు



నిలిచిపోయిన కాలువ నిర్మాణం

వంతెన.. ప్రమాదం అంచున

- ఒంటిమిట్ట–భాకరాపేట మధ్య బ్రిడ్జి శిథిలం
- ముంబయి–చెన్నై ప్రధాన రైలుమార్గం
- మృకుందాశ్రమం వద్ద పొంచి ఉన్న ముప్పు



ఒంటిమిట్ట-భాకరాపేట రైల్వేస్టేషన్ల మధ్య శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జి

రాజంపేట: గుత్తి–రేణిగుంట డబ్లింగ్‌లో ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం మృకుందాశ్రమం వద్ద ఉన్న రైల్వేవంతెన ప్రమాదకరంగా మారింది. ముంబయి–చెన్నై ప్రధాన రైలు మార్గం.. ఉమ్మడి కడప జిల్లా మీదుగా వెళుతోంది. ఈ మార్గంలో ఒంటిమిట్ట–భాకరాపేట రైల్వేస్టేషన్ల మధ్య మృకుందాశ్రమానికి వెళ్లే రహదారిలో బ్రిడ్జి డేంజర్‌గా మారిందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ బ్రిడ్జి కడప ఇంజినీరింగ్ సెక్షన్ పరిధిలోకి వస్తుంది.

నిత్యం రైళ్ల రద్దీ భారం

ఈ బ్రిడ్జిపై నిత్యం రైళ్ల రద్దీభారం పడుతోంది. ఉమ్మడి కడప జిల్లా మీదుగా నిత్యం 30 రైళ్లకుపైగా రాకపోకలు సాగిస్తుంటాయి. గూడ్స్‌రైళ్లు 40కి పైగా వెళ్తుంటాయి. మృకుందాశ్రమం సమీపంలో ఉన్న బ్రిడ్జి స్థితిగతిని పరిశీలిస్తే.. రైల్వే శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోందన్న విమర్శలు వెలువడుతున్నాయి. వంతెన పైన, ట్రాక్ కింది భాగంలో నెర్రెలు ఏర్పడ్డాయి. వంతెన పొడవు ఇదే స్థితి కనిపిస్తోంది. అక్కడ మొక్కలు సైతం మొలవడంతో మరింత దెబ్బతింటోంది.

అప్రమత్తం కాకపోతే పెను ప్రమాదం

ఈ వంతెనను పునర్నిర్మాణం చేపట్టకపోతే.. పెను ప్రమాదాలకు దారితీసే పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. వర్షాల సీజన్‌లో నీటి ఊట ఏర్పడి బ్రిడ్జిని మరింతగా దెబ్బతీస్తోంది. ఫలితంగా బ్రిడ్జి స్లాబ్, గోడలు దెబ్బతింటున్నాయి. ఎప్పుడు కూలుతుందో అన్నట్లుగా ఉంది. ఇప్పటికైనా రైల్వే ఇంజినీరింగ్ శాఖ ఈ బ్రిడ్జిని బాగు చేయడంపై దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజుకు వేళాయె

- తుది గడువు అక్టోబర్ 10
- ఆలస్యమయ్యే కొద్దీ పెరగనున్న అపరాధ రుసుం

రాయచోటి జగదాంబసెంటర్: వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సంబంధించి తొలి అడుగు పడింది. పరీక్ష ఫీజు చెల్లింపునకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లింపునకు అక్టోబర్ 10వ తేదీ తుది గడువుగా ఇంటర్మీడియెట్ బోర్డు నిర్ణయించింది. 2026 మార్చిలో జరగనున్న పరీక్షలకు ఈ నెల 15 నుంచి చెల్లించే విధంగా బోర్డు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. అపరాధ రుసుం లేకుండా చెల్లించేందుకు అక్టోబర్ 10 వరకు గడువు విధించారు. అక్టోబర్ 11 నుంచి 21 వరకు వెయ్యి రూపాయల అపరాధ రుసుంతో చెల్లించే అవకాశం ఉంది. అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజును చెల్లించేందుకు విద్యార్థులు అప్రమత్తమవ్వాలని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు సూచిస్తున్నారు.



పరీక్షల కోసం విద్యార్థులను సంసిద్ధం చేస్తున్న ఉపాధ్యాయుడు (ఫైల్)

పరీక్ష ఫీజుల చెల్లింపు ఇలా

ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ జనరల్/ఒకేషనల్ విద్యార్థులు థియరీ పరీక్ష నిమిత్తం రూ.600 చెల్లించాల్సి ఉంది. జనరల్ కోర్సులు చదివే సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్స్ (సెకండియర్ విద్యార్థులు మాత్రం) రూ.275 చెల్లించాల్సి ఉంది. ఒకేషనల్ కోర్సు చదువుతూ బ్రిడ్జి కోర్సు చేసే విద్యార్థులు బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు పరీక్ష రుసుంగా రూ.165 చెల్లించాల్సి ఉంటుంది. సెకండియర్ చదువుతూ ఫస్టియర్ సబ్జెక్టులు ఫెయిలైన విద్యార్థులు మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం థియరీ ఫీజు కలిపి రూ.1200 చెల్లించాలి. ఒకేషనల్ కోర్సు చదువుతూ ఫస్టియర్, సెకండియర్ ప్రాక్టికల్స్ రాసే విద్యార్థులు రెండేళ్లకు కలిపి రూ.550 చెల్లించాలి. బ్రిడ్జి కోర్సు చదివే విద్యార్థులు రెండేళ్ల పరీక్ష ఫీజు కడితే రూ.330 చెల్లించాలి. ఫస్టియర్, సెకండియర్ పాసై ఉండి, మార్కులు ఇంప్రూవ్‌మెంట్‌కు పరీక్ష రాసే ఆర్ట్స్ విద్యార్థులు రూ.13.50 వంతున సైన్స్ విద్యార్థులు రూ.1600 వంతున చెల్లించాలి.

గడువులోగా చెల్లించాలి

పరీక్ష ఫీజును గడువులోగా చెల్లించాలని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు ఆదేశాలు ఇచ్చాం. గడువు ముగిసిన తర్వాత అపరాధ రుసుంతో చెల్లించాల్సి వస్తుంది.

– రవి, ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం


రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జి.స్వాతి

కొండాపురం : మండలంలోని కె.సుగుమంచిపల్లె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుడ్డొల్ల స్వాతి(13) మృతి చెందారు. తాళ్లప్రొద్దుటూరు ఏఎస్ఐ రాయపాటిబాసు వివరాల మేరకు.. బుక్కపట్నం గ్రామానికి చెందిన జి.అనిల్, వసంత దంపతులకు చెందిన స్వాతి దత్తాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో వతరగతి చదువుతోంది. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో కె.సుగుమంచిపల్లె పునరావాస కేంద్రం సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద తన బంధువుల అమ్మాయిని ఆటో ఎక్కించి తిరిగి రోడ్డు నుంచి ఎడమవైపు నడచి వస్తోంది. కొండాపురం వైపు నుంచి తాడిపత్రికి వెళ్లే ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలై స్వాతి అక్కడిక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ఆయన తెలిపారు.

కాలువలో పడి ఉపాధ్యాయుడు మృతి


మృతిచెందిన ఉపాధ్యాయుడు మధుబాబు

జమ్మలమడుగు : మురికి కాలువలో పడి ఉపాధ్యాయుడు మరణించిన సంఘటన జమ్మలమడుగు పట్టణంలో మంగళవారం జరిగింది. పెద్దముడియం మండలం ఎస్.కొట్టాలపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మధుబాబు(50) మద్యం తాగి సోమవారం రాత్రి ఇంటికి బయలుదేరాడు. మద్యం ఎక్కువగా తాగడంతో నడవలేని స్థితిలో కన్నెలూరు మోటు వద్ద మురికి కాలువలో పడిపోయాడు. ఎవ్వరూ గుర్తించకపోవడంతో అక్కడే మృతిచెందాడు. ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని కాలువలో నుంచి బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



పీలేరురూరల్ : అసాంఘిక శక్తుల నిర్మూలనే లక్ష్యంగా డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ మంగళవారం పట్టణంలో విస్తృత తనిఖీలు నిర్వహించింది. పీలేరులోని ప్రముఖ కేంద్రాలు, కార్యాలయాలు, రైల్వే స్టేషన్, ప్రభుత్వాస్పత్రి, ఆర్టీసీ బస్టాండ్, వారపు సంత ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు సీఐ యుగంధర్ తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం..
పండితులకు శాపం

పండితుల పదోన్నతులపై ఆరేళ్లుగా ఊరించి.. ఇపుడు అటకెక్కించారు. భాషోపాధ్యాయులకు ఇష్టం లేకపోయినా ఏడాదికో మారు భార్య, పిల్లలు, తల్లిదండ్రులకు దూరంగా ఎక్కడిపడితే అక్కడికి బదిలీలు చేసి మానసికంగా ఇబ్బంది పెడుతున్నారు. వందల కిలోమీటర్ల దూరానికి జిల్లాలు మార్చి బదిలీలు చేస్తూ వారిని బలి పశువులు చేస్తున్నారు. తమ పిల్లల చదువులకు బ్రేకులు పడతున్నా భరిస్తూ.. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

- పదోన్నతుల కోసం పదేళ్లుగా పండితుల పాట్లు
- ఏడాదికోమారు మారుమూల ప్రాంతాలకు బదిలీ
- సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయని కూటమి ప్రభుత్వం


ఈ నెల 4న పదోన్నతులు కల్పించాలని డిక్లరేషన్ ఇచ్చేందుకు వచ్చిన బాషా పండితులు

బద్వేల్ : రాష్ట్ర వ్యాప్తంగా 2019లో భాషోపాధ్యాయుల(తెలుగు,హిందీ,ఉర్దూ,సంస్కతం,కన్నడ) పదోన్నతులు జరిగాయి. 13 ఉమ్మడి జిల్లాల్లో 1134 మంది మిగిలి పోగా వైఎస్సార్ కడప జిల్లాలో 114 మంది డీఈఓ పూల్‌లో ఉన్నారు. వీరిలో తెలుగు పండితులు 68, హిందీలో 33, ఉర్దూలో 13 మంది ఉన్నారు. ప్రస్తుతం వీరిది విద్యా శాఖలో ఏ విభాగమో అర్థంకాకుండా పోయింది. ఫలితంగా ఏడాదికో మారు జిల్లా నుంచి జిల్లాకు, కనీస వసతులు లేని మారుమూల గ్రామాలకు బదిలీ చేసి బలితీసుకుంటున్నారు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులు అమలుకానివైనం

ఆరేళ్లుగా ఏడాదికోమారు బదిలీలతో విసిగి వేసారిన భాషాపండితులు ఏదో చోట ఎనిమిదేళ్లగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల్లో 1134 మంది బాషోపాధ్యాయులు హైకోర్టును ఆశ్రయించారు. వారి బాధలను క్షుణంగా పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం సింగిల్ బెంచ్ జడ్జి మన్మధరావు వెంటనే పదోన్నతులు కల్పించాలని, సమాన పనికి తగిన వేతనం ఇవ్వాలని 20 డిసెంబర్, 2024లో తీర్పు ఇచ్చారు. అయితే హైకోర్టు ఆదేశాలు జారీచేసి తొమ్మిది నెలలు కావస్తున్నా కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. పదోన్నతుల అమలులో తాత్సారం చేయడంతో భాషోపాధ్యాయులు నష్టపోతగున్నారు. తమకు పదోన్నతులు కావాలని సెకండ్ గ్రేడ్ టీచర్లు (ఎస్జీటీలు) ఇటీవల కోర్టును ఆశ్రయించారు. ఫలితంగా కోర్టు యథాస్థితి కొనసాగించాలని ఆదేశించింది. అనంతరం భాషా పండితులు కోర్టును ఆశ్రయించగా హైకోర్టు ధర్మాసనం సెప్టెంబర్ 2న స్టేటస్ కో ఎత్తివేసింది.

ఉసూరుమనిపించిన ప్రభుత్వం: హైకోర్టు ధర్మాసనం స్టేటస్‌కో ఎత్తివేసిన వెంటనే భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వం సంకల్పించి సెప్టెంబర్ 4న (ఈ నెల) అన్ని జిల్లాల విద్యాశాఖాధికారుల కార్యాలయాల్లో దరఖాస్తు సమర్పించుకోవాలని సూచించింది. ఎన్నో ఏళ్ల కష్టానికి ఫలితం దక్కిందనే ఆశతో బాషోపాధ్యాయులంతా డీఈవో కార్యాలయాల్లో డిక్లరేషన్ రాసిచ్చారు. తమకు పదోన్నతి ఉత్తర్వులు వస్తాయని ఆశపడే సమయంలో కూటమి ప్రభుత్వం మరల మెలికపెట్టి ఆ ప్రక్రియను ఆపేసింది. ప్రభుత్వ ఉద్యోగంలో సర్వీసు ఉన్న వారికి పదవీ విరమణ చేసేలోగా రెండు పదోన్నతులు కల్పించాల్సి ఉంది. బాషా పండితుల విషయంలో దశాబ్ద కాలంగా ఇది అమలు చేయడంలేదు. ఇరవై ఏళ్ల కిందట చేరిన వారు కూడా పదోన్నతి లేకుండానే పదవీవిరమణ పొందారు.

ప్రాథమిక హక్కు కోల్పోయాం



రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు కోల్పోయాం. ఉద్యోగులందరూ పొందే బదిలీ హక్కు కోల్పోయాం. డీఎస్సీ నియామకాలు జరిగినా, సాధారణ బదిలీలు జరిగినా మారుమూల ప్రాంతాలకు బలవంతంగా బదిలీ చేశారు. రేషనలైజేషన్ ,డిప్యూటేషన్, వర్క్ అడ్జస్ట్‌మెంట్ అంటూ బాషా పండితులను మాత్రమే వేధిస్తున్నారు. ఇంకా ఈ బాధలు పడలేం. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి.

– కె.స్వతంత్రబాబు, బాషా పండితుడు, వైఎస్సార్ కడప జిల్లా

మీరు అడిగినట్లు డిక్లరేషన్ ఇచ్చాం



విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఏ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్నామో తెలుపుతూ పదోన్నతి కోసం ఈ నెల 4న ఆయా జిల్లా విద్యాశాఖాధికారులకు డిక్లరేషన్ ఫారాలు సమర్పించాం. అయినా మరల పదోన్నతులకు బ్రేక్ వేశారు. 90 రోజులలోగా న్యాయస్థానం తీర్పును అమలు చేయలేకపోయారు. కొన్ని ఇబ్బందులు కారణంగా ఆగాయి. ప్రస్తుతం ఎటువంటి ఆటంకాలు లేవు. మాకు న్యాయం చేయాలి.

– రాజారావు, తెలుగు పండితులు, కర్నూలు

హామీలు నెరవేర్చండి



సీఎం, డిప్యూటీ సీఎం ఆరు నెలల కిందట హామీ నెరవేరుస్తామని చెప్పారు. ఇంతవరకూ పట్టించుకోలేదు. ఇదిగో.. అదిగో అంటూ ఆశలు కల్పించి ఉసూరు మనిపిస్తున్నారు. ఆరు సంవత్సరాల నుంచి క్యాడర్ లేకుండా పనిచేస్తున్నాం. ఎక్కడి వేస్తే అక్కడికి భార్య, బిడ్డలను వదలి కిమ్మనకుండా వెళ్తున్నాం. ఇప్పటికైనా దయ ఉంచి పదోన్నతులు కల్పించి శాశ్వత స్థానాలు కేటాయించాలని కోరుకుంటున్నాం.

– పి.కిరణ్‌కుమార్, ల్యాంగ్వేజ్ పండిట్, అన్నమయ్య జిల్లా

ధ్వజస్తంభం సంప్రోక్షణకు అంకురార్పణ



సంప్రోక్షణ పూజలకు పుట్టమన్ను తెస్తున్న అర్చకులు, ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండ రామాలయంలో అర్చకులు ధ్వజస్తంభం సంప్రోక్షణకు మంగళవారం అంకురార్పణ నిర్వహించారు. ఒంటిమిట్ట రామాలయంలో దెబ్బతిన్న ధ్వజ స్తంభం పీఠం, బలిపీఠాలకు రూ.15.50 లక్షలతో నూతన ఇత్తడి కవచాలను అమర్చే పనులు పూర్తయ్యాయి. దీంతో సంప్రోక్షణకు సాయంత్రం పవిత్ర పుట్టమన్ను తీసుకువచ్చి అంకురార్పణ చేశారు. ఆలయ రంగమండపంలో ఉత్సవ మూర్తులను ఉంచి, నూతన పట్టు వస్త్రాలు తొడిగి, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, వాస్తు హోమం, ధ్వజస్తంభానికి అభిషేకం నిర్వహించారు. నేడు ధ్వజస్తంభానికి సంప్రోక్షణ నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు హనుమంతయ్య, నవీన్ కుమార్, అమర్‌నాథ్‌రెడ్డి, అర్చకులు శ్రావణ్ కుమార్, వీణారాఘవాచార్యులు, పవన్ కుమార్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన డ్రైవర్ గంగాధర్

మదనపల్లె రూరల్ : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, ఒకరి పరిస్థితి విషమించిన ఘటన మంగళవారం జరిగింది. బి.కొత్తకోటకు చెందిన రాజప్ప కుమారుడు గంగాధర్ (33) భార్య సులోచనతో కలిసి చంద్రాకాలనీలో నివాసముటున్నాడు. కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది బసినికొండ సమీపంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. తానే స్వయంగా తన బావమరిదికి ఫోన్ చేసి చెప్పాడు. సమాచారం అందుకున్న బావమరిది ఇతరులతో ఘటనాస్థలానికి వెళ్లి బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అదే విధంగా పోతబోలుకు చెందిన నారాయణయ్య కుమారుడు ఎం.తరుణ్ కుమార్(23) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది ఇంటివద్దే హార్పిక్, గన్నేరుపప్పు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. బాధితుడిని కుటుంబసభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ సర్కిల్ కోకిలబార్ వద్ద నివాసం ఉన్న వెంకటస్వామి కుమారుడు కిరణ్ కుమార్(25) కుటుంబసమస్యలతో పురుగుమందు తాగి ఇంటివద్దే ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆయా ఘటనలపై సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మద్యం తాగవద్దన్నందుకు వృద్ధుడి ఆత్మహత్య


రమణ మృతదేహం

నిమ్మనపల్లె : మద్యం తాగొద్దని వారించినందుకు మనస్తాపం చెంది వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో జరిగింది. గుర్రంకొండ మండలం ఎల్లుట్లకు చెందిన చిన్నప్ప కుమారుడు ఎల్లుట్ల రమణ అలియాస్ రమణప్ప(72) కొన్నేళ్ల కిందట భార్య రెడ్డెమ్మతో కలిసి ఉపాధి నిమిత్తం మదనపల్లెకు వచ్చాడు. నీరుగట్టువారిపల్లెలోని చిన్నప్పయ్య నగర్‌లో ఉంటూ బార్బర్ పనులు చేస్తున్నాడు. ఇతడికి ముగ్గురు సంతానం. పదేళ్ల కిందట భార్యాభర్తల మధ్య వివాదం ఏర్పడడంతో నిమ్మనపల్లె మండలం చౌకిళ్లవారిపల్లెకు చెందిన మహిళతో సహజీవనం చేస్తున్నాడు. రమణప్పకు మద్యం అలవాటు ఉండడంతో అనారోగ్యానికి గురయ్యాడు. తరచూ మద్యం తాగుతుండడంతో మంగళవారం సహజీవనం చేస్తున్న మహిళ తాగవద్దంటూ మందలించింది. మనస్తాపానికి గురైన రమణ గుళికల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు బాధితుడిని తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. నిమ్మనపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

తల్లి మందలించిందని కుమారుడు..


హిమగిరి మృతదేహం

మదనపల్లె రూరల్ : పనులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండడంతో తల్లి మందలించింది. మనస్తాపం చెందిన కుమారుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో మంగళవారం జరిగింది. వేంపల్లెకు చెందిన శంకర, హేమావతి దంపతుల కుమారుడు హిమగిరి(16) పదో తరగతి ఫెయిల్ కావడంతో పట్టణంలోని ఓ మెకానిక్ వద్ద పనిచేస్తున్నాడు. తండ్రి శంకర కొంత కాలం కిందట మృతి చెందడంతో తల్లి హేమావతి కూలి పనులకు వెళుతూ జీవిస్తోంది. ఈ క్రమంలో కొన్ని రోజులుగా హిమగిరి పనులకు వెళ్లకుండా తిరుగుతుండటంతో మంగళవారం తల్లి మందలించింది. మనస్తాపం చెందిన హిమగిరి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

ఫైనాన్షియర్‌ను చంపితే బిజినెస్ పెట్టిస్తా

- కిరాయి హంతకులకు ఆఫర్ ఇచ్చిన సూత్రధారులు
- వారితోనే వేణుగోపాల్‌రెడ్డిని హత్య చేయించిన దుండగులు

ప్రొద్దుటూరు క్రైం : సుపారీ కల్చర్ ప్రొద్దుటూరుకు ప్రాకింది. తెలంగాణా రాష్ట్రం నుంచి కిరాయి హంతకులను పిలిపించి ఫైనాన్షియర్‌ను హత్య చేయించారు. ఇటీవల జరిగిన ఫైనాన్స్ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి హత్య పట్టణంలో సంచలనం కలిగించింది. హైదరాబాద్‌కు చెందిన కిరాయి హంతకులు ఈ హత్య చేశారని తెలియడంతో ప్రొద్దుటూరు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ముంబై, ఢిల్లీ, బీహార్ తదితర రాష్ట్రాలకు పరిమితమన సుపారీ కల్చర్ ఇప్పుడు ఈ ప్రాంతానికి ప్రాకడంతో పసిడిపురిలో అలజడి మొదలైంది. ఈ నెల 19న రాత్రి వడ్డీ వ్యాపారి వేణుగోపాల్‌రెడ్డి హత్య జరిగిన తర్వాత పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తులో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగు చూసినట్లు తెలుస్తోంది.

మూడు నెలల క్రితమే హత్యకు ప్రణాళిక..

వేణుగోపాల్‌రెడ్డి హతమార్చిన ఘటనలో ఇరువురు బాకీ దారులే ప్రధాన సూత్రదారులు. ఇరువురు వడ్డీ వ్యాపారిని హత్య చేయడానికి మూడు నెలల క్రితమే ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. వీరిలో ఒక వ్యక్తి గతంలో పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో చిల్లర దుకాణం నిర్వహించాడు. దుకాణాన్ని ఎత్తేసిన అతను కొన్ని నెలల నుంచి హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. హైదరాబాద్‌లో ఒక ప్లాట్ కొనుగోలు చేశాడు. హైదరాబాద్‌కు వెళ్లినప్పుడు ఆ ప్లాట్‌లోనే ఉండేవాడు. హైదరాబాద్‌లో ఉన్న మరో యువకుడిని అతడు సహాయకుడిగా పెట్టుకున్నాడు. ప్రొద్దుటూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లిన ప్రతిసారీ సహాయకుడే పికప్ చేసుకొని ప్లాట్‌కు తీసుకెళ్లేవాడు. సహాయకుడికి డబ్బు అవసరం ఉండటంతో రూ.80 వేల వరకూ ఇచ్చాడు. నెల రోజుల క్రితం తనకు ఒక పని చేసి పెట్టాలని బాకీ దారు తన సహాయకుడిని అడిగాడు. ×ఒక వ్యక్తిని చంపాలి.. ఈ పని చేసి పెడితే నీ లైఫ్ సెటిల్ చేస్తా.. లేదంటే బిజినెస్ పెట్టిస్తా€ అన్నాడు. అతని ఆఫర్‌కు హైదరాబాదీ అంగీకరించాడు. తొలిసారి వినాయకచవితి పండగ సమయంలో హైదరాబాద్ నుంచి తన సహాయకుడ్ని తీసుకొని ప్రొద్దుటూరుకు వచ్చాడు. జమ్మలమడుగు రోడ్డులోని బొల్లవరం ప్లాట్ వద్దకు వెళ్లి ఫైనాన్షియర్ ఇల్లు చూపించాడు. స్కూటీలో ఇంటికి వచ్చి పోయే సమయంలో పలుమార్లు వేణుగోపాల్‌రెడ్డిని చూపించి గుర్తు పెట్టుకోమని చెప్పాడు. దీంతో అతడి సహాయకుడు హైదరాబాద్‌కు వెళ్లి తనకు తెలిసిన మరో ముగ్గురిని వెంట పెట్టుకొని ఈ నెల 19న కారులో ప్రొద్దుటూరుకు వచ్చారు. ఇక్కడికి వచ్చిన తర్వాత సూత్రదారులు ఇద్దరు కిరాయి హంతకులకు ఖర్చుల కోసం రూ. 23 వేలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అదే రోజు రాత్రి వేణుగోపాల్‌రెడ్డి స్కూటీలో ఇంటికి వెళ్లే సమయంలో అడ్డగించి, కళ్లలో కారం చల్లి హైదరాబాద్‌కు చెందిన హత్య చేసిన విషయం తెలిసిందే. హత్య చేయడానికి కిరాయి హంతకులు పెద్ద మొత్తంలో ఒప్పందం కుదుర్చుకుంటారు. అడ్వాన్స్‌గా లేదా ఏక మొత్తంలో డబ్బు తీసుకొని పనిముగిస్తారు. అయితే ఇక్కడ మాత్రం సూత్రధారులు హైదరాబాదీ కిరాయి హంతకులకు బిజినెస్ పెట్టిస్తాననే ఆశ చూపి వేణుగోపాల్‌రెడ్డిని చంపించారు. ఇద్దరు బాకీదారులు ఫైనాన్షియార్‌ను హత్య చేయించినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇతర బాకీదారుల ప్రమేయం ఏమైనా ఉందా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తిరస్కరించిన వారినే.. తీసుకొచ్చారు

- టీడీపీ కడప నగర నూతన కమిటీ నియామకం
- పార్టీకి పనిచేసేన వారిని పక్కన పడేశారని అసంతృప్తి
- తమ్ముళ్ల తిరుగుబాటు వేళ నిర్ణయంపై ఆగ్రహం


విలేకరులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సూర్యనారాయణ

కడప రూరల్ : కడప నగరం తెలుగుదేశం పార్టీలో రాజకీయాలు గరంగరంగా మారాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవీరెడ్డి నిర్ణయాలపై ఆ పార్టీ కార్యకర్తలు బహిరంగంగానే వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక పాతకడప కృష్ణారెడ్డి నేతృత్వంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కమలాపురానికి వెళ్లి తమకు న్యాయం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని శరణు కోరడంతో పెద్ద దుమారమే రేగింది. అనంతరం పార్టీని ఫిరాయించిన కార్పొరేటర్లు కూడా పాత కడప కృష్ణారెడ్డిపై విరుచుకుపడ్డారు. ఇదిలా ఉన్నా.. పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి కడప నగర నూతన కమిటీని నియమించారు. నగర అధ్యక్షుడిగా పఠాన్ మన్సూర్ అలీఖాన్, ఉపాధ్యక్షుడిగా పసుపులేటి గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ముక్కా సుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బోనం వెంకటేష్, గండ్లూరి బాబా ఫక్రుద్దీన్, ఇప్పిరాల పూర్ణచంద్రరావు, కార్యదర్శులుగా కోనేటి వెంకటేష్ ఆచారి, గోగుల శ్రీనివాసులు, జి.నరేష్, కోశాధికారిగా మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిలను నియమించారు. దీంతో తమ్ముళ్ల వివాదానికి మరింత ఆజ్యం పోసినట్లైంది. ఇదివరకే నగర కమిటీ వ్యవహారంపై పార్టీ అధిష్ఠానం కార్యకర్తల అభిప్రాయాలను సేకరించింది. చాలా మంది అభ్యర్థుల పట్ల వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఈ కమిటీని అధిష్ఠానం 'రిజెక్ట్' చేసిందనే ప్రచారం జరిగింది. తీరా చూస్తే వారినే కొత్త కమిటీలో చేర్చడంతో తమ్ముళ్ల అసంతృప్తి సెగలు ఎగసిపడ్డాయి. పార్టీ ఫిరాయించిన వారితోపాటు టీడీపీలో గుర్తింపు లేని వారికి చోటు కల్పించడం దారుణమని కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. తాము తిరస్కరించినా, తమ పంతం, ఆధిపత్యం కోసం కమిటీ నియమించారని తమ్ముళ్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీకి సేవలు చేసిన కార్యకర్తలను పక్కన పడేశారని ఆరోపిస్తున్నారు.

తప్పు చేయొద్దంటే...తిరుగుబాటు చేస్తావా

– పాత కడప కృష్ణారెడ్డిపై విరుచుకుపడిన కార్పొరేటర్లు

పాత కడప కృష్ణారెడ్డి చేయని అక్రమాలంటూ లేవు.. టీడీపీలో ఉంటూ ఆయన ఒక్కడే లబ్ధి పొందాడు.. ఇపుడు తప్పు చేయవద్దంటే తిరుగుబాటు చేస్తున్నాడు అని పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు సూర్యనారాయణ, సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మంగళవారం వారు మాట్లాడుతూ కృష్ణారెడ్డి సొసైటీ డైరెక్టర్‌గా పదవి అనుభవిస్తూ పార్టీపైనే విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రెవెన్యూ శాఖలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని, సొంత కుటుంబ సభ్యుల ఆస్తులను కాజేసిన నైజం కృష్ణారెడ్డిదని దుయ్యబట్టారు. డీలర్లను కూడా వదలిపెట్టలేదన్నారు. అభివృద్ధిని ఆకాంక్షించి తాము టీడీపీలో చేరామని, ఇపుడు అభివృద్ధిచూసి ఓర్వలేక కృష్ణారెడ్డి ఆరోపణలు చేయడం తగదన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే మాధవీరెడ్డి వద్ద ఉంటూ పెద్ద ఎత్తున లబ్ధి పొందారని వారు ఆరోపించారు. కడపలో ఏదో జరుగుతోందని కృష్ణారెడ్డి తన అనుచరులను వెంటేసుకుని పెద్దాయన పుత్తా నరసింహారెడ్డి వద్దకు వెళ్లారన్నారు. ఆయనకు కడపలో జరుగుతున్న అంశాలపై పెద్దగా తెలియదన్నారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ నిత్యం అక్రమాలకు పాల్పడే నువ్వు మమ్మల్నే బెదిరిస్తావా....రా చూసుకుందాం అంటూ కృష్ణారెడ్డికి సవాల్ విసిరారు. కార్యక్రమంలో జఫ్రుల్లా, చల్లా రాజశేఖర్, బాలకృష్ణారెడ్డి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కామాంధుడికి దేహశుద్ధి

– భయాందోళన చెందుతున్న మహిళలు

గుర్రంకొండ : సెల్ ఫోన్‌లో మహిళల ఫొటోలు తీస్తూ వికృతానందం పొందుతున్న ఓ కామాంధుడికి గ్రామస్తులు, మహిళలు దేహశుద్ధి చేశారు. మండల కేంద్రం గుర్రంకొండలో జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చిరు వ్యాపారాలు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. గత సోమవారం కొత్తపేట వీధిలో సంచరిస్తూ వీధుల్లో నడిచి వెళ్తున్న మహిళల ఫొటోలు తీశాడు. వీధి వెంబడి వెళుతున్న ఓ మహిళ అనుమానం కలిగి సదరు వ్యక్తి సెల్ ఫోన్‌ను లాక్కొని పరిశీలించగా ఫొటోలు ఉండడం గమనించింది. గట్టిగా నిలదీయడంతో చుట్టుపక్కల వారు చేరుకొని సదరు కామాంధుడికి దేహశుద్ధి చేశారు. కొంతమంది అతడి ఫోన్‌ను పూర్తిస్థాయిలో పరిశీలించగా గ్రామం లోని పలు ప్రాంతాలకు చెందిన 500మందికి పైగా మహిళల ఫొటోలు ఉండడంతో నివ్వెరపోయారు. గ్రామస్తులు అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటనపై విచారణ జరిపి కఠినచర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాల వ్యాన్ ఢీకొని ఒకరు మృతి


మృతి చెందిన సుబ్రహ్మణ్యం

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై మంగళవారం ఓ పాల వ్యాన్ ఢీకొన్న సంఘటనలో ఎస్.సుబ్రహ్మణ్యం(58) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. మోటకట్లకు చెందిన సుబ్రహ్మణ్యం శివాలయం సమీపంలో స్కూటర్‌పై వస్తున్నారు. రాయచోటి వైపు నుంచి వస్తున్న పాలవ్యాన్ ఇతడి స్కూటర్‌ను ఢీకొంది. తీవ్రగాయాలైన సుబ్రహ్మణ్యంను చికిత్స నిమిత్తం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంబేపల్లె పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

4న వాహనాల వేలం

రాజంపేట : రవాణా శాఖ సీజ్ చేసిన వాహనాలకు అక్టోబరు 4న వేలంపాట నిర్వహిస్తున్నట్లు రాజంపేట మోటారు వెహికల్ అధికారి తెలిపారు. తనిఖీలలో పట్టుబడిన వాహనాలను రాజంపేట ఆర్టీసీ డిపోలో ఉంచామన్నారు. ఆసక్తి గల వారు ఉదయం పది గంటల నుంచి 11 గంటల లోపు రూ.5 వేల ధరావతు చెల్లించాలన్నారు. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ చూపించి టోకన్ తీసుకోవాలన్నారు. వేలం వేసే వాహనాల వివరాలు అన్నమయ్య జిల్లా కార్యాలయం నోటీసు బోర్డులో ఉన్నాయన్నారు.

గంజాయి మత్తులో కూలీలపై దాడి


గాయపడిన వారిని పరామర్శిస్తున్న నాయకులు


రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని రెడ్డివారిపల్లి వంతెన వద్ద పనిచేస్తున్న కూలీలు దేవరాజునాయుడు, మల్లికార్జునలపై కొందరు యువకులు గంజాయి మత్తులో మంగళవారం దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు గుర్తించి హుటాహుటిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. వైఎస్సార్సీపీ నాయకులు సీహెచ్.రమేష్, బుడుగుశివయ్య బాధితులను పరామర్శించారు. విషయం తెలుసుకొన్న పోలీసలు కేసు నమోదు చేసి దాడి చేసిన వారిలో మణికంఠ, కార్తీక్, మరొకరిని అరెస్ట్ చేసారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు


పోలీసుల అదుపులో కోడిపందెం రాయుళ్లు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని దిగువ అబ్బవరం హరిజనవాడ ప్రాంతంలో కోడి పందెం రాయుళ్లను అరెస్టు చేసినట్లు రాయచోటి అర్బన్ సీఐ సిబి.చలపతి తెలిపారు. ఎస్పీ ధీరజ కునుబిల్లి ఆదేశాల మేరకు పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టామన్నారు. మంగళవారం దిగువ అబ్బవరం గ్రామంలోని పొలాల వద్ద కోడి పందెం ఆడుతున్నట్లు తెలియడంతో దాడులు నిర్వహించి 12 మందిని అరెస్టు చేశామని, వారి నుంచి రూ.25 వేల నగదు, 26 స్కూటర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వా రిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పెడుతున్నట్లు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


సూచనలిస్తున్న జిల్లా అధికారి రామచంద్రారెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వస్థ నారీ శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మధుమేహ, రక్తపోటు పరీక్షలు, టీబీ శాంపిల్ కలెక్షన్, కిశోర బాలికలకు అవగాహన తదితర అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. డైరీ అండ్ ఎంఎఫ్–2 రిజిష్టర్ గురించి తెలుసుకొని సూచనలు చేశారు. అనంతరం వెక్టార్ కంట్రోల్, ఫ్రైడే డ్రైడేలను క్షుణ్ణంగా పరిశీలించారు. డాక్టర్ ఎస్ జియాఉల్లా, సిబ్బంది జయరామయ్య, దేవదానం పాల్గొన్నారు.